# చరిత్ర పునరావృత్తం కాలేదు

గత రెండు రోజులుగా అరుంధతి జ్ఞాపకాలు పురుగుల్లా తొలుస్తున్నాయి రాజారావుని. అందుకు కారణం సువర్చల.

తలుచుకుంటే ఆశ్చర్య మనిపిస్తుంది. నిన్న మొన్నటి వరకు సువర్చల పసిపాప లాగానే కనిపించింది అతని కళ్ళకి. పద్దెనిమిదేళ్ళు దాటి పైట వేసుకున్న గుండెలలో యౌవనం ప్రవేశించిన సువర్చల అతని కళ్ళముందే తిరుగాడుతున్నా, గౌనుకూడా తొడుక్కోకుండా తన కాళ్ళకి చుట్టేసుకుని "నాన్నా! ఎత్తుకో" అంటూ మారాం చేసే మూడేళ్ళ సువర్చలనే చూశాడు ఆమెలో.

"సువర్చల కూడా ఎదిగి పోయింది" అనుకున్నాడు రాజారావు పెద్దగానే.

వేపచెట్టు నీడ మరకలుగా పడుతూంది పెరడంతా. గేటు పక్కన సువర్చల నాలుగేళ్ళ క్రితం నాటిన సన్నజాజి తీగ విరబూసి కమ్మటి సువాసనని గాలితోపాటుగా తెరలు తెరలుగా మోసుకు వస్తుంది.

"అరుంధతి పోయి అప్పుడే పన్నెండేళ్ళు!" మళ్ళీ అనుకున్నాడు పెద్దగా.

అరుంధతికి సన్నజాజులు అంటే చాలా ఇష్టం. ప్రతి రోజు అడిగేది—"రాజా! వచ్చేటప్పుడు నాకు సన్నజాజి పూలు తెచ్చి పెట్టు" అని.

అరుంధతి బారయిన నల్లని జడ జాజి పూలు తురుముకున్నప్పుడు మరింత అందంగా కనిపించేది. అరుంధతిని ఎప్పుడు దగ్గిరికి తీసుకున్నా, సన్నజాజుల పరిమళం గుప్పున గుబాళించేది ఆమె కురులలోనుండి.

గాఢంగా నిట్టూర్పు విడిచాడు రాజారావు.

"నాన్నా!"

తల ఎత్తి చూశాడు.

సువర్చల నిలబడి ఉంది ఎదురుగా. తన వైపే చూస్తోంది. ఎవరో కొత్త వ్యక్తిని చూసినట్టు చూశాడు రాజారావు. సువర్చలలో ప్రతి అణువూ ఏదో కొత్తగా ఉన్నట్టు, తనకు అసలు పరిచయమే లేనట్టు గమనిస్తున్నాడు.

"ఏమిటి, నాన్నా, అలా చూస్తున్నావు?" నవ్వుతూ అడిగింది సువర్చల.

అలా నవ్వినప్పుడు పెదాలు సాగాయి. బుగ్గల్లో చిన్న సొట్ట పడింది. విశాలంగా ఉండే కళ్ళు కొంత మూసుకుపోయాయి.

అరుంధతి కూడా ఇలాగే నవ్వేది. బుగ్గల్లో ఇలాగే సొట్ట పడేది. ఆ నవ్వు కోసం కావాలని నవ్వించేవాడు తను అరుంధతిని. నవ్వినవ్వి అలసిపోయి "నేను ఇక నవ్వలేను బాబూ" అంటూ తన గుండెపై వాలిపోయేది అరుంధతి.

"నాన్నా!" కుదుపుతూ పిలిచింది సువర్చల.

ఉలిక్కిపడ్డాడు రాజారావు.

"ఏమిటమ్మా?" అన్నాడు ఈలోకంలోకి వస్తూ.

"ఏమిటి అలా ఉన్నావు? ఒంట్లో బాగా లేదా?" రాజారావు నుదుటిపై చెయ్యివేస్తూ అడిగింది సువర్చల.

"మనస్సు బాగాలేదు." నెమ్మదిగా అన్నాడు, సువర్చల మీద నుంచి దృష్టి మరలుస్తూ.

ఒక్కక్షణం అర్థం కానట్టు చూసింది సువర్చల.

"అన్నం పెట్టాను రా!" అన్నది చివరికి.

లేచి వెళ్ళాడు రాజారావు సువర్చల వెంట. అన్నాన్ని కెలుకుతూ కూర్చున్నాడే కాని తిన బుద్ధి కాలేదు.

తల ఎత్తి చూశాడు.

మోకాలిమీద గడ్డం ఆన్చి తనకేసే చూస్తూ ఉన్నది సువర్చల. అరుంధతి కూడా అలాగే కూర్చునేది. అలాగే చూస్తూ ఉండేది తన కేసి. సువర్చలలో అరుంధతి పోలికలు ఇన్ని ఉన్నాయా? తను ఎందుకని ఇంతవరకు గుర్తించలేక పోయాడు?

"ఏమిటి, నాన్నా, అలా చూస్తున్నావు?" అడిగింది సువర్చల.

"అబ్బే, ఏం లేదు" అంటూ తల తిప్పుకుని భోజనం పూర్తి కానిచ్చాడు.

బయట వరండాలోకి వచ్చి కుర్చీలో కూర్చున్నా కూడా ఆలోచనలు అతన్ని వదల లేదు. సువర్చల కూడా దూరం అయితే తను అసలు బ్రతకగలడా? అనిపించింది. సువర్చల లేని ఇల్లు తలపుకు వచ్చింది. ఒక్క క్షణంపాటు వణికాడు ఆ ఊహకు. వద్దు! అలా ఎన్నటికీ జరగకూడదు. సువర్చల కూడా తనకి దూరం అయితే తన జీవితానికి ఇక అర్థమే ఉండదు.

సువర్చల పక్క వేస్తుంది.

తలంటిపోసుకోవటం వల్ల జడ వదులుగా ఉంది. అందులో అరుంధతికి ఇష్టమైన జాజి పూలు! అరుంధతి పోయిన తరవాత మొదట్లో చాలాసార్లు అడిగేది సువర్చల—అమ్మ ఏదని. తనేదో మాయమాటలు చెప్పి నిద్రపుచ్చేవాడు. తన గుండెలమీదే పడుకుని నిద్రలోకి జారిపోయేది. అప్పుడప్పుడు నిద్రలో లేచి భయమేస్తున్న దనేది. దగ్గరికి తీసుకునే వాడు తను. తనని గట్టిగా చుట్టుకుని మళ్ళీ నిద్రపోయేది. సువర్చల ప్రవర్తనలో అప్పటికీ, ఇప్పటికీ మార్పు కనిపించక పోయినా, తన మనస్సు మాత్రం సువర్చలని ప్రత్యేకంగా చూస్తుంది రెండు రోజులుగా. ఎందుకని అలా? మొన్న జరిగిన సంఘటనేనా దానికి కారణం?

ఆ రోజు తను ఇంట్లోనే ఉన్నాడు ఒంట్లో బాగుండక. ఏదో అవసరం వచ్చి సువర్చల పుస్తకాలు తిరగేస్తుంటే అందులో జారి క్రింద పడింది ప్రేమలేఖ. మొదట్లో ఎవరి ఉత్తరం అన్నా సువర్చల పుస్తకాల్లోకి పొరపాటున వచ్చిందేమో అనుకున్నాడు. కాని, తన ఊహ పొరపాటు అని చదివిన తరవాత తెలిసింది. అది సువర్చలకి రాసిందే. అతని పేరు సురేష్. అది అతని మొదటి ఉత్తరం మాత్రమే కాదని, ఇదివరకు చాలా ఉత్తరాలు రాసుకుని ఉన్నారని తెలుసుకున్నప్పుడు నిశ్చేష్టుడే అయ్యాడు తను.

"నాన్నా! పక్కేశాను." చెప్పింది సువర్చల.

"ఊఁ" అంటూ లేచి వెళ్ళి పక్క మీద పడుకున్నాడు.

సువర్చల! అది అరుంధతి పెట్టినపేరే. సువర్చల చిన్న పిల్లగా ఉండేటప్పుడు అనేది అరుంధతి చాలాసార్లు—"రాజా! మన సువర్చల కూడా ఎవర్నయినా ప్రేమించి నిన్ను కాదని వెళ్ళిపోతుం దనుకో అప్పుడు నీ కేమనిపిస్తుంది?" అని. తనప్పుడు ఏమని సమాధానం ఇచ్చే వాడో గుర్తు లేదు కానీ, సువర్చల తన నుంచి దూరం కాదనే నమ్మకం మాత్రం ఉండేది తనలో.

"నాన్నా! ఇదిగో వక్కపొడి."

బాహ్య ప్రపంచంలోకి వచ్చాడు రాజారావు. ఎదురుగా సువర్చల.

"వక్కపొడి" అంటూ రాజారావు చేతిలో ఉంచింది వక్కపొడి.

వక్కపొడి అందుకుంటూ సువర్చల చేతిని పరీక్షగా చూశాడు. చేతులకి [illegible] కనిపిస్తున్నాయి. సన్నటి వేళ్ళు గోరింటాకుతో పండి ఎంతో అందంగా కనిపిస్తున్నాయి.

సువర్చల వెళ్ళిపోయింది.

అరుంధతి గోరింటాకు పెట్టుకుంటే ఇంకా ఎర్రగా పండేది. తనకి బాగా గుర్తు! అప్పటికి ఇంకా సువర్చల పుట్టలేదు. ఆ రోజే గోరింటాకు పెట్టుకుంది అరుంధతి. ఎర్రగా పండిన ఆమె చేతిని ముందు ఉంచి ముద్దుపెట్టుకున్నాడు తను. ఇంకా అరుంధతి చేతిని వీడని గోరింటాకు వాసన హాయిగా ఉంది. కొంతసేపు ఇద్దరి మధ్య నిశ్శబ్దం రాజ్యమేలాక అన్నది అరుంధతి — "రాజా! నేను చచ్చిపోతే నువ్వెలా బ్రతుకుతావు?" అంటూ. తనూ అరుంధతితోనే చచ్చిపోతాను అన్నాడు. కాని, అరుంధతి చచ్చిపోయినా వదిలి తనకు సువర్చల మిగిలింది ప్రేమ పంటగా. సువర్చలని ఏ లోటూ రానీయక జాగ్రత్తగా పెంచమని చెప్పి కన్ను మూసింది అరుంధతి. తను మాత్రం సువర్చలతో సహా మిగిలిపోయాడు ఈ ప్రపంచంలో.

చుట్టూ చూశాడు రాజారావు.

ఆకాశం అంతా మబ్బులు కమ్ముకున్నాయి. వెన్నెల మసకగా పడుతున్నది. కిటికీలో నుంచి గదిలో చదువుకుంటున్న సువర్చల కనబడుతూంది.

ఇంతవరకు సువర్చలకి ఏ లోటూ రానీయ లేదు తను. తల్లిలేని లోటు తెలియనీకుండనే పెంచాడు. కాని, ఇప్పుడు తెలుస్తుంది పిల్లలతో మాట్లాడటానికి కొన్ని కొన్ని సమయాల్లో తల్లి ఎంత అవసరమో. ఈ సమయంలో అరుంధతి ఉంటే సువర్చలని నెమ్మదిగా అడిగేది ఆ ఉత్తరం గురించి. కాని, ఇప్పుడు అరుంధతి లేదు. ఒక పసిపిల్లలా సువర్చలకి ఏ లోటూ రానీయకుండా చూసుకోగలిగాడే కాని, వయస్సు వచ్చిన కూతురితో దాని మనస్సులోని భావాలు ఏమిటో తను తెలుసుకోలేదు. [illegible] చేతకాదు ఎలా అడగాలో.

తలుపు తీసి లోపలికి చూశాడు. పడుకుని ఉంటున్న సువర్చల కనిపించింది. మళ్ళీ తల తిప్పుకున్నాడు.

ఒకప్పుడు అరుంధతి సువర్చల స్థానంలో ఉండేది. తను సురేష్ స్థానంలో ఉన్నాడు. కానీ, తాము ఏ నాడూ ఇంట్లో వాళ్ళ అభిప్రాయాలతో సంబంధం పెట్టుకోలేదు. తమ జీవిత మార్గాలని నిర్ణయించుకునే హక్కు తమకు ఉన్నట్టుగా భావించారు. ఇద్దరూ పెళ్ళిచేసుకోవాలని కూడా అనుకున్నారు. తన కెవ్వరూ లేరు, అరుంధతితో తన జీవితం ముడిపడుతుంటే అభ్యంతరం పెట్టటానికి. కానీ, అరుంధతికి అందరూ ఉన్నారు. వాళ్ళు ఒప్పుకుంటారా? అన్న సందేహం వెలిబుచ్చాడు తను. ఆ మాట విని ఉగ్రంగా చూసింది అరుంధతి. "నా భవిష్యత్తు మీద వాళ్ళ కేమిటి అధికారం?" అన్నది తల ఎగరేస్తూ. ఒక వేళ వాళ్ళు ఒప్పుకోక పోతే ఎటయినా వెళ్ళిపోదాం అన్నది ధైర్యంగా. అలా అనుకున్నప్పుడు ఆ విషయంలో భవిష్యత్తుమీద ఎంతో నమ్మకం, ఆశ మెరిశాయి అరుంధతి కళ్ళల్లో. అరుంధతి అలా అనగలిగినందుకు చాలా సంతోషపడ్డాడు తను. తన వాళ్ళని కూడా కాదని తను ప్రేమించిన వాడితో బయలుదేరి వస్తోన్నందుకు ప్రేమ మీద ఆమెకున్న నమ్మకానికి పొంగిపోయాడు తను. వాళ్ళు వాళ్ళు రాదనటంతో చివరికి ఓ రాత్రి తా మిద్దరూ కలిసి వెళ్ళిపోక తప్పలేదు. నిజానికి ఆ సమయంలో అరుంధతి తండ్రి పరిస్థితి ఎలా ఉంటుందోనని అయినా కనీసం ఊహించాడా తను? లేదు.

తనతో వచ్చేసినందుకు ప్రతిగా తన వాళ్ళందర్నీ కోల్పోయింది అరుంధతి. "మా వాళ్ళని చూసొస్తావా?" అని అప్పుడప్పుడు అడిగేవాడు తను అరుంధతిని. అలా అన్నప్పుడు అరుంధతి ముఖంలో ఒక్కక్షణం బాధ లీలగా మెదిలేది. ఎక్కడో చూస్తున్నట్టు ఉండేవి ఆ సమయంలో అరుంధతి చూపులు. కానీ, అంతలోనే మళ్ళీ మామూలుగా అయిపోతూ — "నీకన్నా కావలసిన వాళ్ళు నా కెవరున్నారు?" అంటూ, తన గుండెల మీద వాలిపోతూ. అలాంటి సమయాల్లో మాత్రం తనకు అమితమైన జాలి కలిగేది అరుంధతి మీద.

మళ్ళీ ఈ లోకంలోకి వచ్చాడు రాజారావు.

చుట్టూ చూశాడు. ఇంకా వెన్నెల మసకగానే పడుతూంది.

సువర్చల కూడా అరుంధతి లాగే ప్రవర్తిస్తే తాను సహించగలడా? అని ఆలోచించాడు ఒక్క క్షణం పాటు. సరియైన సమాధానం దొరకలేదు. కాని, సువర్చల ఒకవ అలా వెళ్ళిపోతే అది ఎక్కువ బాధ కలిగిస్తుందో, నా జీవితం ఎక్కువ నాశనం అవుతుందో అని మాత్రం తప్పకుండా పోయాడు. ఒకటిమాత్రం నిజం. తా నా అమ్మాయిని ప్రేమించినట్టు సువర్చల చెబితే, అప్పుడు ఇష్టపడే అరుంధతి తండ్రిలా మాత్రం విడిచిపెట్టలేడు తను. కానీ, తను సువర్చల అలా చెప్పి నిలుపుకుంటుందా? అదే తెలీదు.

అసలు, అయినా తనెందుకు ఇంతగా ఆలోచించాలి? సువర్చల కూడా అరుంధతి లాగే వెళ్ళిపోతుందని భయమా? అది ముమ్మాటికీ సరి కాదు. తా నొక

# చివుకుల సీతారామబాబు

దారిన పడిన వాళ్ళు మిగిలిన వాళ్ళని ఆ దారిని తొక్కనివ్వరు. కానీ, తను పరిస్థితులు ఎదురవుతాయి. ఆ దారిని వచ్చారు, ఆ దారిని వెళ్ళవలసిన పరిస్థితులు తనకు లేవని ఎలా సువర్చలకు తెలుసు? అనే ఆలోచన ఇంతగా ఆలోచింప చేస్తున్నది.

ఇంతలో సువర్చల వచ్చింది.

చేతులోని మంచినీళ్ళ చెంబు మంచం పక్కగా ఉంచి రాజారావుకేసి చూసింది. అతను ఇంకా నిద్రపోకపోవటం చూసి ఆశ్చర్యపోయింది.

"ఏమిటి, నాన్నా, మీరు ఇంకా పడుకోలేదా?"

"లేదమ్మా. నిద్ర రాలేదు" అన్నాడు రాజారావు సువర్చలని చూస్తూ.

"ఏందుకు, నాన్నా, ఆరోగ్యం సరిగ్గా లేదా?" మంచం మీదనే అతని పక్కగా కూర్చుని నుదుటి మీద చెయ్యివేసి చూస్తూ అడిగింది.

చల్లటి సువర్చల చెయ్యి ఒక్కసారి హాయినిపించింది రాజారావుకి.

"బాగున్నా. మా అమ్మ నువ్వు వచ్చావు" అన్నాడు నెమ్మదిగా.

"పోనీ, నాన్నా, కొందరోజులుగా మీరు ఏదో బాధపడుతున్నట్టు కనిపిస్తున్నారు. నాకు చెప్పకూడదా?" అడిగింది అతని కళ్ళల్లోకి ప్రేమగా చూస్తూ.

ఆ క్షణంలో మళ్ళీ ముసుగుతీ అమాయకత్వంతో చిన్న పిల్లలా కనిపించింది సువర్చల. ఒక్క క్షణం పాటు సమాధానం చెప్పలేదు. ఏం మొదలు పెట్టాలో తెలియటం లేదు. సువర్చ నొప్పించకుండా అనాలని. కాని, సువర్చలకి ఏదో చెప్పాలనిమాత్రం ఉంది.

"సువర్చా! ..." అంటూ ఆగాడు.

"చెప్పండి, నాన్నా!"

"మా అమ్మ పోయిన దగ్గర్నుంచి నిన్నెంతో ప్రేమగా తల్లిలేని లోటు తెలియకుండా పెంచాను. అవునా?"

తల ఊపింది సువర్చల. ఏమీ మాట్లాడలేదు.

సువర్చల తల దించుకోవటం వల్ల ముఖంలో ఏ ఏ భావాలు మెదిలాయో తెలుసుకోలేక పోయాడు రాజారావు. సువర్చల తలమీద చెయ్యివేసి ఆప్యాయంగా నిమురుతూ —

"సురేష్ ఎవరమ్మా?" అన్నాడు.

సమాధానం ఇవ్వలేదు సువర్చల.

"ఏం? ఇది నాతో నేను తెలుసుకో కూడదా?" అన్నాడు, ఒకసారి తల నెమ్మదిగా ఎత్తుతూ.

రాజారావు ప్రశ్నకి మౌనంగా ఉండిపోయింది సువర్చల. ఒక్కసారి రాజారావు చేతిలోనుంచి తన చెయ్యి విడిపించుకుని, సువర్చల అలా ఉండిపోయింది.

"ఏందుకమ్మా ఆ కన్నీరు? నేను ఇప్పుడు ఏమన్నాను?" అన్నాడు ఆశ్చర్యంగా.

రాజారావు చేతుల్లోనుంచి తప్పించుకుని కన్నీరు తుడుచుకుంటూ లోపలికి వెళ్ళింది సువర్చల.

గాఢంగా నిట్టూర్చాడు రాజారావు.

మళ్ళీ అనిపించింది. అరుంధతి దగ్గర అయితే, సువర్చల ఇలా తప్పించుకుని దూరంగా వెళ్ళిపోయేదా? అని. ఇప్పుడు అరుంధతి లేదు. సువర్చలకి తల్లి అయినా, తండ్రి అయినా తను ఒక్కడే. సువర్చల మనసులోని భావం తెలుసుకుని ఆమెకు ఇష్టమైన బాటలో జీవితాన్ని సాగనివ్వటం ప్రేమను గురించి తెలిసిన తండ్రిగా తన బాధ్యత.

నెమ్మదిగా లోపలికి వెళ్ళాడు.

కుర్చీలో కూర్చుని పుస్తకం మీద తల ఆన్చి కుంటుతూ కూర్చుంది సువర్చల.

"సువర్చా ..."

తుళ్ళిపడి వెనక్కి తిరిగింది సువర్చల.

"అతను నీ క్లాస్‌మేటా?" దగ్గరికి వస్తూ అడిగాడు రాజారావు.

తల ఊపింది సువర్చల.

తరవాత ఏం అడగాలో ఒక్క క్షణం పాటు తోచలేదు రాజారావుకి.

"నిన్ను అతను ప్రేమించానన్నాడా?"

"అవును." నెమ్మదిగా సమాధానం చెప్పింది సువర్చల.

"పెళ్ళికూడా చేసుకుంటానన్నాడా?"

తల ఊపింది.

"మరి నువ్వు సురేష్ ఇష్టమేనా?"

మళ్ళీ తల ఊపింది.

"రేపు ఒక సారి అతన్ని మన ఇంటికి తీసుకు రా. మాట్లాడతాను."

"అలాగే" అంది సువర్చల.

అప్పుడు సువర్చల కళ్ళల్లో మెరిసిన ఆనందాన్ని చూసి రాజారావు చిన్నగా నవ్వుకున్నాడు.

"ఏమమ్మా... ఇందాక ఎందుకలా ఏడ్చావు? నన్ను చూస్తే భయమేసిందా?" సువర్చల తల నిమురుతూ అన్నాడు.

నెమ్మదిగా తల ఆడించింది సువర్చల.

"ఇప్పటి వాళ్ళంతా పెరిగారు! నేను ఏ నాడయినా నీ మాట కాదన్నానా? పిచ్చితల్లి ... నువ్వు అమ్మ లేని కూతురివి నా లోకంలో" అన్నాడు రాజారావు.

ఆ సమయంలో అతని కళ్ళముందు అరుంధతి మెదిలింది. కళ్ళు చెమర్చుటంతో పరిసరాలు మసక బారాయి.

బయటికి వచ్చిన తరవాత మంచం మీద పడుకుంటూ అనుకున్నాడు.

'సువర్చల విషయంలో చరిత్ర పునరావృతం కాలేదు. ఆ రోజు అరుంధతి తండ్రి నా కివ్వలేని అవకాశాన్ని ఈ రోజు సువర్చల తండ్రిగా సురేష్‌కి ఇవ్వబోతున్నాను. ఒక తరంలో వచ్చిన మార్పుకు ఫలితమా ఈ నిర్ణయం!'

తెల్లటి వెన్నెల మబ్బు చాటునుంచి నిండుగా పడుతున్నా ఎంతో అందంగా కనిపించింది రాజారావు కళ్ళకి. ✻

కలుకోసం
చిత్రం— దాసరి వెంకటసుందర్ (జగిత్యాల)

